క్లుప్తంగా

'దళిత అణగారిన వర్గాలకు అండగా ఉంటాం'



మాట్లాడుతున్న నాయకులు

కోటపల్లి: దళిత అణగారిన వర్గాల ప్రజలకు అండగా ఉంటామని ఆల్‌ఇండియా యువ జన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. శెట్‌పల్లి శంకరాపూర్ గ్రామంలో ఆదివారం ఆల్ ఇండియా యువజన సంఘం సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామాల్లో కమిటీ ఏర్పాటు చేసి దళిత అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, సంపత్, లక్ష్మణ్, రాజేందర్, రాజన్న, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రెండో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై మందమర్రికి వెళ్తున్న నూనె శ్రీనివాస్‌ను ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీస్‌స్టేషన్లో ఘనంగా సన్మానించారు. ఏఎస్సైగా, రెండో ఎస్సైగా గత కొంత కాలంగా పట్టణంలో శ్రీనివాస్ అందించిన సేవలను కొనియాడారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగియుండటంలో అలాగే శాంతిభద్రతల పరిరక్షణలో శ్రీనివాస్ సేవలు మరువలేనివని పేర్కొన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, నాయకులు రఘునాథ్‌రెడ్డి, గాండ్ల సమ్మయ్య, మహంకాళి శ్రీనివాస్, పాలం సత్యం తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటూ...

పాతమంచిర్యాల: బీసీ ఐక్యవేదిక జిల్లా యువత అధ్యక్షుడిగా జైపూర్ మండలం రామారావుపేటకు చెందిన పెద్దల చంద్రకాంత్‌ను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నియామకపత్రాన్ని చంద్రకాంత్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు వేముల మల్లేష్, జైపూర్ మండల బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు జంగంపల్లి శివకుమార్, నాయకులు క్రాంతి, మహ్మద్ లతీఫ్ పాల్గొన్నారు.

ఘనంగా గజ్జపూజ



పూజల్లో పాల్గొన్న భక్తులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో ఆదివారం గజ్జపూజ కార్యక్రమం నిర్వహించారు. సమీక్ష ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి విద్యార్థులకు ఈ ప్రత్యేక పూజ నిర్వహించారు. కూచిపూడి నేర్చుకునే విద్యార్థులు ప్రదర్శన చేసే ముందు మువ్వలకు పూజ చేసి కాళ్లకు కట్టడం ఆనవాయితీ అని పేర్కొన్నారు.

లంబాడీతండాలో కమ్యూనిటీ పోలీసింగ్



అవగాహన కల్పిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లంబాడీతండాలో ఆదివారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మత్తు పదార్థాలు, గంజాయి, మద్యపానం, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన, 100డయల్, స్త్రీలపై జరిగే దాడులు పలు అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వాహనాల పత్రాలు సక్రమంగా లేని 35మోటారుసైకిళ్లు, 4లీటర్ల గుడుంబా సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా, అనుమానం వచ్చినా పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, పోలీసులు పాల్గొన్నారు.

సాగు నీరందేదెలా?

- కాలువల్లో పెరిగిన పిచ్చి మొక్కలు
- పట్టించుకోని అధికారులు



అంగ్రాజ్‌పల్లిలో కాలువ నీరు వెళ్లే కల్వర్టు వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు



చెరువు నుంచి వచ్చే కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు

చెన్నూర్‌రూరల్: చెరువు నుంచి పంటలకు సాగు నీరందించేందుకు గాను ఏర్పాటు చేసిన కాలువల్లో పిచ్చి మొక్కలు మొలిచి, చెత్తా చెదారం నిండి అధ్వానంగా తయారయ్యాయి. దీంతో పంట పొలాలకు సాగు నీరందడం కష్టంగా మారింది. మండలంలోని కాచన్‌పల్లి కొత్త చెరువు నుంచి అంగ్రాజ్‌పల్లి, రాయిపేట గ్రామాల్లోని పంట పొలాలకు సాగు నీరందించేందుకు ఆనాటి ప్రభుత్వం 35ఏళ్ల క్రితం కాలువలను ఏర్పాటు చేసింది. ఈ కాలువల ద్వారా సుమారు 500ఎకరాల పంట పొలాలకు సాగు నీరందుతోంది. కొన్నేళ్లుగా కాలువల్లో మొత్తం పిచ్చి మొక్కలు మొలిచి, చెత్త చెదారం నిండుకుపోవడంతో నీరు వెళ్లలేకుండా మారింది. మరమ్మతులు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో కాలువ నీటితో పంటలు పండిస్తున్న రైతులు సాగు నీరందకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని కాలువల్లో మొలిచిన పిచ్చి మొక్కలను, చెత్తా చెదారాన్ని తొలగించి, పూర్తి స్థాయిలో మరమ్మతు చేయించి పంటలకు సాగు నీరందించేలా చూడాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి



చెరువు ద్వారా పంట పొలాలకు కాలువ ద్వారా నీరందాలి. కానీ కాలువలో మొత్తం పిచ్చి మొక్కలు మొలవడంతో నీరు రాకుండా అయ్యింది. ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు పట్టించుకొని కాలువల ద్వారా పంట పొలాలకు నీరందించాలి. – రత్న వెంకన్న, రైతు

మరమ్మతు చేస్తలేరు..



కాచన్‌పల్లి చెరువు నుంచి అంగ్రాజ్‌పల్లి, రాయిపేట గ్రామాల్లోని పంట పొలాలకు సాగు నీరందించేందుకు గాను ఏర్పాటు చేసిన కాలువలకు ఇంత వరకూ మరమ్మతు చేపట్టలేదు. కాలువల్లో మొత్తం పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం నిండిపోయింది. – భాస్కర్‌రెడ్డి, రైతు

పనులు చేసేందుకు కృషి చేస్తాం

కాచన్‌పల్లి చెరువు నుంచి అంగ్రాజ్‌పల్లి, రాయిపేట గ్రామాల్లోని పంట పొలాలకు సాగు నీరందించే కాలువలను పరిశీలిస్తాం. ప్రస్తుతం పనులు చేసేందుకు అనుకూలంగా ఉంటే, ఈజీఎస్ ద్వారా పనులు మంజూరు చేయించి పనులు చేపడుతాం. – మోహన్, ఎంపీడీవో, చెన్నూర్

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డు బురదమయం



భీమారం: మండల కేంద్రంలోని గొల్లవాగు ప్రాజెక్ట్ ప్రధాన కాలువ పక్క నుంచి నిర్మించిన రోడ్డు బురదమయం కావడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారి పక్క నుంచి మామిడిగూడెం వెళ్లే రైతులతో పాటు ఇతరులు కూడా ఈ రోడ్డు ద్వారా రాకపోకలు సాగిస్తారు. మట్టి రోడ్డు కావడంతో వర్షాకాలంలో ఆ రోడ్డుపై నడవాలంటే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని, కాలువ పక్కనే గల రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: శశాంక్‌రెడ్డి, గొల్లవాగు ప్రాజెక్ట్ ఏఈ, మంచిర్యాల
ఫోన్ నంబర్: 95052 89404

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో గెలుపొందిన చెన్నూర్ విద్యార్థులు

చెన్నూర్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జాతీయ స్థాయి కరాటే, కూంగ్‌ఫూ పోటీల్లో చెన్నూర్ శార్వాణి పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నట్లు కరాటే మాస్టర్ రామగిరి స్వామి, కరస్పాండెంట్ మేడ శ్రావణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 12సంవత్సరాల లోపు కటా విభాగంగా దివ్యశ్రీ ప్రథమ, జాహ్నవి ద్వితీయ, పది సంవత్సరాల లోపు స్పారింగ్ విభాగంలో సనాతని ద్వితీయ, జయదీప్‌రెడ్డి తృతీయ స్థానాల్లో గెలుపొందారు. జాతీయ స్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలను పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు అభినందించారు. మందమర్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో న్యూ లయోల పాఠశాలకు చెందిన జతిన్, కౌశిక్‌లు ప్రథమ, వేదశ్రీ, అనూషలు ద్వితీయ స్థానాల్లో గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులను మాస్టర్ అఫ్రీన్, ఉపాధ్యాయులు అభినందించారు.

అందుబాటు ధరల్లో పరీక్షలు



ల్యాబ్ ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

చెన్నూర్: మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో పరీక్షలు నిర్వహణ అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా అన్నారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ పక్కన, కొత్తగూడెం రోడ్డులో ఆదివారం హిందూ సేవక్ సమాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్లినికల్ ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. చెన్నూర్ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు గుండా దామోదర్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజి రెడ్డి, విశ్రాంత ఉప కోశాధికారి కోర్నాల నారాయణరెడ్డి, బీజేపీ నాయకులు దుర్గం అశోక్, విశ్వ హిందు పరిషత్ చెన్నూర్ అధ్యక్షుడు నడిపల్లి లక్ష్మణ్ రావు, హిందూ సేవక్ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బండవరం జగన్, సభ్యులు పాల్గొన్నారు.

మంద కృష్ణకు స్వాగతం పలకాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మందమర్రిరూరల్/తాండూర్: ఎస్సీ వర్గీకరణ సాధించి ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు ఈ నెల 13న వస్తున్న మంద కృష్ణ మాదిగకు ఘనస్వాగతం పలకాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ పిలుపునిచ్చారు. మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో, తాండూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీలను వర్గీకరించాలని గడిచిన 30ఏళ్ల నుంచి కృష్ణ అలుపెరుగని పోరాటం సాగించారన్నారు. మాదిగ జాతి భవిష్యత్ కోసం నిరంతరంగా చేసిన పోరాటం ఫలించి సుప్రీంకోర్టు సానుకూలమైన తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఈ క్రమంలో ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు 13వ తేదీన మందకృష్ణ తొలిసారిగా వస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఘన స్వాగతం పలకడానికి మాదిగలు భారీగా తరలిరావాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ తాండూర్ మండల ఇన్‌చార్జి జిలకర శంకర్‌మాదిగ, తాండూర్ మండల అధ్యక్షుడు తరంగి మాదిగ, ఎమ్మార్పీస్ మందమర్రి ఇన్‌చార్జి జీడి సారంగం, మందమర్రి మండల అధ్యక్షుడు శివకుమార్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

పోడు సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలి



జెండా ఎగురవేస్తున్న టీఏజీఎస్ నాయకులు

వేమనపల్లి: మండలంలోని బుయ్యారం గ్రామంలో కొన్ని తరాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు హక్కు పత్రాలివ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) జిల్లా నాయకురాలు మర్మల రాజేశ్వరి అన్నారు. బుయ్యారం గ్రామంలో ఆదివారం టీఏజీఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ వారోత్సవాల సందర్భంగా జెండా ఎగురవేశారు. 21మంది పోడు రైతులపై అక్రమకేసులు పెట్టించి అటవీ అధికారులు కోర్టుల చుట్టూ తిప్పుతున్నారన్నారు. నాగారంలో పోడుసాగు చేస్తుండగా అటవీ అధికారులు ట్రాక్టర్‌ను సీజ్ చేశారని మండిపడ్డారు. పోడు, సాగుదారులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని, సీజ్ చేసిన ట్రాక్టర్‌ను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో టీఏజీఎస్ నాయకులు మర్మల శంకర్, నాగమల్లు, కమల, జయ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడు ఎస్.వెంకటస్వామి డిమాండ్ చేశారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని కార్మికవాడల్లో సమస్యలు ఎక్కడికక్కడే తిష్ట వేసి ఉన్నా పట్టించుకున్న నాథుడే లేరన్నారు. సంస్థ లాభాలను వెంటనే ప్రకటించి, కార్మికులకు 35శాతం వాటా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, రామస్వామి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



పుష్పగుచ్ఛం ఇస్తున్న అధికారులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాకు బదిలీపై వచ్చిన జీఎం దేవేందర్ ఆదివారం జీఎం ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏరియా ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ తదితర అధికారులు జీఎంకు పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన జీఎం మనోహర్ పర్యావరణం (కార్పొరేట్) విభాగంకు బదిలీపై వెళ్లారు.

కొనసాగుతున్న 'హర్‌ఘర్ తిరంగా'

- బీజేపీ ఆధ్వర్యంలో మహనీయుల విగ్రహాలు శుద్ధి



లక్సెట్టిపేట: శివాజీ విగ్రహం శుద్ధి చేస్తున్న నాయకులు



రామకృష్ణాపూర్: జాతీయ జెండాలతో ర్యాలీ

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఉన్న జాతి నేతల విగ్రహాలను ఆదివారం బీజేపీ, అనుబంధ సంఘాల శ్రేణులు శుద్ధి చేశారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుభ్ర పరిచారు. కాంటా చౌరస్తాలో ఉన్న బాబా సాహెబ్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్నీ, బూడిదగడ్డ చౌరస్తా వద్ద ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలను, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. అనంతరం పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాచర్ల సంతోష్, బీజేపీ పట్టణ అధ్యక్షురాలు దార కళ్యాణి, నాయకులు ఆకుల శంకర్, మద్దెర్ల శ్రీనివాస్, ఏముర్ల ప్రదీప్, నవీన్, నర్సింగ్, శ్రావణ్, శ్రీనివాస్, అనిల్ సుమ తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద ఉన్న శివాజీ విగ్రహాన్ని మండల బీజేపీ నాయకులు ఆదివారం శుద్ధి చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు సామ వెంకటరమణ, నరేష్‌చంద్‌జైన్, ప్రభాకర్, రమేష్‌చంద్‌జైన్, వెంకటేష్, పాంచాల రమేష్, సిద్దార్థ, తిరుపతి, గంగన్న, నరేష్,పాల్గొన్నారు.

చెన్నూర్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మహనీయుల విగ్రహాలను ఆదివారం శుద్ధి చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, నాయకులు బత్తుల సమ్మయ్య, కమ్మల శ్రీనివాస్, వెంకటనర్సయ్య, కేవీఎం శ్రీనివాస్, శివకృష్ణ, తుమ్మ శ్రీపాల్, తలారి రాజు, కాయిత వెంకటేశ్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: బీజేపీ జాతీయ నాయకత్వం పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో మోటార్‌బైక్ ర్యాలీ చేపట్టారు. జాతీయ జెండాలను చేతపట్టుకుని స్వాతంత్ర్య సమరయోధులను స్మరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు సంతోష్ రామ్ నాయక్, పార్టీ నాయకులు ఆరుముళ్ల పోషం, వేముల అశోక్, ఈశ్వరాచారీ, సత్యనారాయణ, బంగారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు చర్మవ్యాధి



చర్మవ్యాధి సోకిన కుక్క

భీమారం: కొన్ని రోజులుగా మండల కేంద్రంలో చర్మవ్యాధి సోకిన కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చర్మవ్యాధి కలిగిన కుక్కలు ఎక్కడ దాడి చేస్తాయో అని భయాందోళన చెందుతున్నారు. కుక్కల నివారణ కోసం గతంలో గ్రామపంచాయతీ ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, హత మార్చేవారు. ఐదేళ్ల నుంచి కుక్కలను నిర్మూలించొద్దని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో గ్రామపంచాయతీ వాటి గురించి పట్టించుకోవడం లేదు. దాడి చేసి ప్రజలను గాయపర్చక ముందే కుక్కలను తరలించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

కార్మికుడికి పరామర్శ

కాసిపేట: కాసిపేట గనిలో అండర్‌గ్రౌండ్ ట్రామర్ శరత్‌కుమార్ కు గని ప్రమాదంలో గాయాలు కాగా ఆది వారం ఐఎన్‌టీయూసీ నాయకులు శివకృష్ణ ఆధ్వర్యంలో ఆర్‌కేపీ ఏరియా ఆస్పత్రికి వెళ్లి బాధిత కార్మికుడిని పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకొని, రక్షణ అధికారితో మాట్లాడి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు భూమన్న సీఎంవోతో మాట్లాడి కరీంనగర్ ఆస్పత్రికి పంపించినట్లు తెలిపారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి



మాట్లాడుతున్న సంకె రవి

పాతమంచిర్యాల: వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, గ్రామాల్లో పారిశుద్యం లోపించిందని, ప్రజలు విష జ్వరాల బారిన పడి అల్లాడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు పారిశుద్యం లోపించినా, ప్రభుత్వ యంత్రాంగం పనులు నిర్వహించడం లేదన్నారు. విష జ్వరాలతో ఇప్పటికి ఇద్దరు మృతిచెందారని, అయినప్పటికీ అధికార యంత్రాంగం పారిశుధ్యం పనులు నిర్వహించడానికి కదలడం లేదన్నారు. మెడికల్ క్యాంపులు నిర్వహించి వ్యాధుల బారిన పడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, పారిశుధ్యం లోపం ఉన్న ప్రాంతాలను గుర్తించి దోమలు, ఈగల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు దాసరి రాజేశ్వరీ, జిల్లా కమిటీ సభ్యులు బోడెంకి చందు, నాయకులు ఉమారాణి, సమ్మక్క, సరిత రాజేశ్వరీ, సంధ్య, యామిని, మధు లక్ష్మి, ఎల్లయ్య, రమేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



నిత్యావసర సరుకులు అందిస్తున్న క్లబ్ సభ్యులు

మంచిర్యాలటౌన్: వాసవిక్లబ్ గవర్నర్ జంద్యం మాధవి పర్యటన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను ఆదివారం జిల్లా కేంద్రంలో క్లబ్ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకుల పంపిణీ చేయడంతో పాటు, నిరుపేద మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఏకలవ్య ఆశ్రమంలో బియ్యం అందించి, విద్యార్థులకు బిస్కెట్లు అందించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ జిల్లా కేబినెట్ సెక్రటరీ జంద్యం మధుకర్, క్యాబినెట్ ట్రెజరర్ కేశెట్టి వంశీకృష్ణ, రీజియన్ చైర్మన్ కాసం సతీశ్, రీజియన్ సెక్రటరీ గౌరిశెట్టి ధనలక్ష్మి, అక్కనపెల్లి రవీందర్, పుల్లూరి బాలు మోహన్, ఉత్తూరి రమేశ్, నాగిశెట్టి జ్యోతి, దొంతుల లావణ్య, నలమాసు ప్రవీణ్, అయిత శ్రీనివాస్, సరిత, తాటిపల్లి రమేశ్ పాల్గొన్నారు.

పచ్చదనం.. ప్రకృతి సోయగం



జైపూర్ మండలం పెగడపల్లి మీదుగా షెట్‌పల్లి వరకు రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు వృక్షాలయ్యాయి. ఎటు చూసినా పచ్చదనం పరుచుకుంది. పచ్చదనం.. ప్రకృతి సోయగాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. – జైపూర్